
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 17 జూలై 2024



ఫలితాల్లో ఆదర్శం..
సౌకర్యాలు శూన్యం -8లో..

ప్రభుత్వ ఆర్డర్లతో రెండు రోజులే పని -8లో..




**ఈ ఏడాది మండలాల వారీగా యాక్షన్ ప్లాన్**

| మండలం | చెరువులు | చేపపిల్లలు |
|---|---|---|
| బోయినపల్లి | 36 | 33.08 లక్షలు |
| చందుర్తి | 34 | 8.78 లక్షలు |
| గంభీరావుపేట | 49 | 22.67 లక్షలు |
| ఇల్లంతకుంట | 68 | 25.27 లక్షలు |
| కోనరావుపేట | 48 | 9.26 లక్షలు |
| ముస్తాబాద్ | 35 | 9.45 లక్షలు |
| రుద్రంగి | 07 | 1.01 లక్షలు |
| సిరిసిల్ల | 19 | 4.46 లక్షలు |
| తంగళ్లపల్లి | 39 | 6.78 లక్షలు |
| వీర్నపల్లి | 18 | 3.54 లక్షలు |
| వేములవాడ రూరల్ | 29 | 4.71 లక్షలు |
| ఎల్లారెడ్డిపేట | 40 | 8.62 లక్షలు |
| మొత్తం | 441 | 141.57 |

# మత్స్యకారులకు ఊరట

- ఉచిత చేప పిల్లల పంపిణీకి సర్కారు నిర్ణయం
- ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు
- 23న ముగియనున్న గడువు.. అదేరోజు పరిశీలన
- ఈ సారి చేప పిల్లల లక్ష్యం 1.41 కోట్లు
- టెండరు విలువ రూ.1.59 కోట్లు
- జిల్లాలో 138 మత్స్య పారిశ్రామిక సంఘాలు, 8828 మంది సభ్యులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మత్స్యకారుల ఉపాధిపై సందిగ్ధం వీడింది. గత ప్రభుత్వ హయాంలో ఎనిమిదేళ్లుగా కొనసాగిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యాక్రమం ఈ సారి 'ఉంటుందో, ఉండదో' అని అయోమయానికి గురయ్యారు. ఈ సారి కూడా ఉచితంగా చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం మత్స్యకారులకు ఊరటనిచ్చింది. ప్రాజెక్టులు, చెరువుల్లోకి చేపపిల్లలను పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా టెండర్ ప్రక్రియను ప్రారంభించింది. ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నారు. టెండర్లను ఈ నెల 23వ తేదీన సాయంత్రమే తెరిచి తక్కువ ధరకు కోట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్ట్ అప్పగించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి, ఎగువ మానేరు ప్రాజెక్టులతో పాటు జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 440 చెరువులు, 138 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 8,820 మంది సభ్యులు ఉన్నారు. 20 మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాలు, రెండు ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి.

**● పంపిణీకి ఏర్పాట్లు**

జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి యాక్షన్ ప్లాన్ ప్రకారం రూ.1.59 కోట్లతో 1.41 కోట్ల చేప పిల్లలను ప్రాజెక్టులు, చెరువుల్లో వదలాలని నిర్ణయించుకున్నారు. చేపపిల్లల్లో టెండర్ ప్రక్రియలో 35 - 40 మిల్లీమీటర్ల సైజులో ఉన్న చేపలకు ఒక్కొక్కటి 61 పైసల చొప్పున, 80 -100 మిల్లీమీటర్ల సైజులో ఉన్న చేప పిల్లలకు రూ.1.63 పైసల ధరను నిర్ణయించారు. జిల్లాలో ప్రధానంగా అనేక రకాల చేపపిల్లల ఉత్పత్తి జరుగుతుంది. బొమ్మె, కొర్రమట్ట, కొర్రమీను, మొట్ట, మరల్ వివిధ పేర్లతో పిలిచే చేపలతోపాటు రవులు, మార్పులు, గురిజెలు, పాపెర, పంకిరి, చందమామలు, పరకలు, మొయ్యలు, ఉలిసెలు, కొడిపెలు, పరకలు, గెచ్చులు, వాగు గెచ్చులు, జెల్లలు వంటి రకాలు ఉత్పత్తి అవుతున్నాయి. జిల్లాలో చేపల ఉత్పత్తిపైనే మత్స్య పారిశ్రామిక సంఘాల ద్వారా మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా చెరువులను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు.



**చేప పిల్లలు చెరువుల్లో వదిలిన తీరు**

| సంవత్సరం | జలవనరులు | వదిలినవి |
|---|---|---|
| 2016- 17 | 92 | 30.5 లక్షలు |
| 2017- 18 | 66 | 20 లక్షలు |
| 2018- 19 | 95 | 57.48 లక్షలు |
| 2019- 20 | 313 | 100.91 లక్షలు |
| 2020- 21 | 362 | 115.61 లక్షలు |
| 2021- 22 | 392 | 119.25 లక్షలు |
| 2022 -23 | 392 | 138.27 లక్షలు |
| 2023 -24 | 440 | 141.00 లక్షలు |
| 2024 -25 | 441 | 141.00 లక్షలు |

## సీఎం సమావేశానికి కలెక్టర్



సీఎం సమావేశానికి హాజరైన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరయ్యారు. రేవంత్ రెడ్డి వివిధ పథకాల అమలుపై కలెక్టర్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి, చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై చర్చించారు.

## నేడు ఎమ్మెల్యే రాక

ఇల్లంతకుంట, జూలై 16: మండలంలోని ఇల్లంతకుంట, గాలిపెల్లి సహకార సంఘాలఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంకులను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు బుధవారం ప్రారంభించనున్నట్లు అధ్యక్షుడు రొండ్ల తిరుపతిరెడ్డి, అన్నాడి అనంతరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ బంకులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వంట మనిషి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ముస్తాబాద్, జూలై 16 : ముస్తాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వంట మనిషి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి భూక్య బన్నాజీ పేర్కొన్నారు. 1 జూన్ 2024 నాటికి 18 సంవత్సారాలు నిండి 45 సంవత్సారాలలోపు మహిళలు అర్హులని తెలిపారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్థానిక కేజీబీవీ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్‌కు విద్యార్హతలు జిరాక్స్ ఆధార్ కార్డు జతపరిచి అందజేయాలని సూచించారు.

## కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రుద్రంగి, జూలై 16: రుద్రంగి మండల కేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు డాక్టర్ ప్రభాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, రక్తహీనత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో వనిత, ఏఎన్ఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

ఎల్లారెడ్డిపేట, జూలై 16: రాష్ట్ర ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయానాయక్‌ను ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గిరిజన నాయకులు సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజునాయక్, హరిలాల్‌నాయక్, గజన్‌లాల్‌నాయక్, నవీన్‌నాయక్, మున్నీసింగ్‌రాథోడ్, భాస్కర్, నరేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిసరాలను పరిశీలిస్తున్న సిబ్బంది

తంగళ్లపల్లి, జులై 16: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నయిమా సూచించారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఈవో లింగం,పంచాయతీ కార్యదర్శి మౌనిక, సాయికుమార్, మంజుల, రమ పాల్గొన్నారు.

**వీర్నపల్లి** : నివాసాల వద్ద ఖాళీగా, నిరుపయోగంగా ఉన్న నీటితొట్టెలు, డ్రమ్ములు, కొబ్బరి బొండాలే వంటి వాటిల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ఏఎన్ఎంలు మంజుల, ఇందిర, సుజాత కీర్తి సూచించారు. మంగళవారం డ్రై డే సందర్భంగా వీర్నపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయాలన్నారు. అందరూ కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. దోమల బారిన పడకుండా ఉండేందుకు దోమ తెరలు వాడాలన్నారు.



నీటి కుండీని పరిశీలిస్తున్న ఏఎన్ఎం





సిరిసిల్లలో అంగన్‌వాడీ బాట ర్యాలీ

## అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

సిరిసిల్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచే దిశగా మంగళవారం జిల్లా కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమ్మమాట.. అంగన్‌వాడీ బాట పేరుతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అంబేద్కర్‌నగర్ సెక్టార్ పరిధిలో ర్యాలీని కౌన్సిలర్ జాగీరు శైలు ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల సంరక్షణ, నాణ్యమైన పౌష్టికాహారం, పూర్వ విద్యను అందిస్తున్నారని వీటిని ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్కిరెడ్డి రజని, ఆశా వర్కర్ వర్ష తదితరులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, దుమాల తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా ప్రతినిధులు అమ్మ మాట- అంగన్‌వాడీ బాట ర్యాలీలు నిర్వహించారు. చిన్నారులతో కలిసి ప్రదర్శనలు చేపట్టారు. రెండేళ్ల వయస్సు ఉన్న పిల్లలను గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, తల్లిదండ్రులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన హామీ నెరవేరుస్తాం

**● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



వేములవాడ టౌన్, జూలై 16 : రైతులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రుణమాఫీపై వస్తున్న రూమర్లపై మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రుణమాఫీకి రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఒక యూనిట్‌గా పరిగణిస్తుందని, అర్హులైన రైతు కుటుంబాలకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అదనపు నిబంధనలేవీ విధించలేదని, ఒక్కో రైతు కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ వర్తిస్తున్నందున మాత్రమే రేషన్ కార్డుల డేటాబేస్‌ను ప్రభుత్వం వినియోగిస్తుందని పేర్కొన్నారు. 2014, 2018 సంవత్సరాల్లో లక్ష రూపాయాల రుణమాఫీ అమలు చేసిన నిబంధనలనే కొత్త ప్రభుత్వం పాటిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం మభ్యపెట్టినట్లుగా దాచిపెట్టినట్లుగా కాకుండా, అందరికీ అర్థమయ్యేలా రుణమాఫీ వవిధి విధానాల ఉత్తర్వులను జారీ చేసినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం 2020 మార్చి 17వ తేదీన జారీ చేసిన రైతుల రుణమాఫీ జీవోలోనూ ఇదే విషయాన్ని ప్రస్తావించిందని పేర్కొన్నారు. అప్పటి జీవో నంబరు 148లోని సెక్షన్(బీ) ఆరో నిబంధనలో అందుబాటులో ఉన్న డేటాబేస్ ఆధారంగా రైతుల కుటుంబాన్ని నిర్ధారించడంతో పాటు, ఒకటికి మించి రుణాలు తీసుకున్న వారిని గుర్తించి బ్యాంకులు ఇచ్చిన జాబితా తుది పరిశీలన ఉంటుందని స్పష్టంగా ప్రస్తావించారని వివరించారు. కుటుంబాలను నిర్ధారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర అప్పుడైనా, ఇప్పుడైనా రేషన్ కార్డుల డేటాబేస్ తప్ప మరొకటి అందుబాటులో లేదని తెలిపారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వం దాచిపెట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తెలియజేసేలా పారదర్శకతను పాటించిందని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉంటేనే రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని జరుగుతున్న ప్రచారం సరైనది కాదని, రుణమాఫీకి రైతు కుటుంబం యూనిట్‌గా పరిగణిస్తున్నందున ఆ కుటంబాన్ని నిర్ణయించడానికి మాత్రమే రేషన్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని రైతులందరు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం 89.96 లక్షల రేషన్ కార్డులున్నాయని, ఈసారి రుణమాఫీ పథకం దాదాపుగా 30 లక్షల మంది రైతులకు వర్తిస్తుందని వ్యవసాయశాఖ ఇప్పటికే బ్యాంకులు ఇచ్చిన డేటా ఆధారంగా అంచనా వేసిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం దేశమందరి దృష్టిని ఆకర్షించేలా భారీ మొత్తంలో ఈ పథకానికి రూ. 31 వేల కోట్ల నిధులు కేటాయించిందని, రాష్ట్రంలో దాదాపు 30 లక్షల రైతు కుటుంబాలు రుణ విముక్తి పొందుతున్నాయని తెలిపారు. రేషన్ కార్డు లేని అర్హులైన రైతు కుటుంబాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అలాంటి రైతులేవరైనా ఉంటే వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పోర్టల్, మండల స్థాయిలో ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ సెంటర్లలో ఫిర్యాదు చేయాలని, 30 రోజుల్లో అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి అర్హులైతే రుణమాఫీ చేస్తారని పేర్కొన్నారు. కలెక్టర్, డివిజన్, మండల వ్యవసాయాధికారులు ఫిర్యాదుల పరిష్కారంలో చురుకుగా పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని తెలిపారు. పీఎం కిసాన్ పథకంలో నిబంధనలతో రాష్ట్రంలోని రైతుల్లో ఎక్కువ మంది రుణమాఫీ అర్హత కోల్పోతారనే ప్రచారంలోనూ వీసమెత్తు నిజం లేదని రైతులు నమ్మవద్దని కోరారు. ప్రభుత్వం వద్ద ఇప్పటి వరకు ప్రభుత్వ ఉద్యోగుల డేటా తప్ప మిగతావేవీ అందుబాటులో లేవని, దీంతో పీఎం కిసాన్ నిబంధనలతో అర్హులైన రైతులెవరూ ఈ రుణమాఫీకి దూరమయ్యే పరిస్థితి లేనే లేదని స్పష్టం చేశారు. గతంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రైతులను రుణమాఫీ పేరుతో మోసం చేసిందని, రెండు సార్లు కలిపి కేవలం రూ.28 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసిందని పేర్కొన్నారు.





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల )

# తొలిపండుగ 'ఏకాదశి'

**● నేడు తొలిఏకాదశి ● ముస్తాబైన ఆలయాలు ● తెలుగు పండుగలు షురూ**

తెలుగు పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతాయి. ఆయా ప్రాంతాల ప్రత్యేకతను చాటుతాయి. సంవత్సరం పొడవునా జరుపుకునే పండుగలు బుధవారం వచ్చే ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి ప్రారంభం కానున్నాయి. తెలుగు సంవత్సరాది ప్రకారం ప్రతీ సంవత్సరం అషాఢ మాసంలో 11వ రోజును అషాడ శుద్ధ ఏకాదశిగా భావిస్తారు. తొలి పండుగను జరుపుకోవడానికి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. పండుగ సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. దేవాలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. పరమ పవిత్రంగా జరపుకునే ఏకాదశి రోజునే పండరీపూర్ పల్కియాత్ర మొదలవు తుంది. సిరిసిల్ల పద్మశాలీలకు షోలాపూర్, పండరీపూర్‌తో అనుబంధం ఉండడంతో పల్కి యాత్రలో భాగస్వాములవుతారు.

### ఉపవాసానికి ఎంతో ప్రత్యేకత

'తొలి ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, భీష్మ ఏకాదశిలకు ప్రత్యేకత ఉంది. ఏకాదశి వ్రతంలో ముఖ్యమైంది ఉపవాసం. ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా నిర్వహిస్తారు. దీనిని శయన ఏకాదశిగా పిలుస్తారు. మహావిష్ణువు క్షీరాబ్దిలో శయనిస్తాడు కనుక శయన ఏకాదశిగా చెప్పుకుంటారు. అంతే కాకుండా ప్రకృతిలోనూ మార్పులు మొదలవుతాయి. సూర్యుడు, చంద్రుడు, గ్రహాలలో మార్పులు సంభవిస్తాయి. ప్రత్యక్ష దైవంగా చెప్పుకునే సూర్యుడు దక్షిణం వైపునకు మారినట్లు దక్షిణాయన ప్రారంభాన్ని సూచిస్తుంది. అసలు పంచాంగంలో నెలకు రెండు చొప్పున 24 ఏకాదశిలు వస్తాయి. అందులో తొలి ఏకాదశి, ముక్కోటి ఏకాదశిని ఎంతో విశిష్టంగా నిర్వహిస్తారు. ఏకాదశి రోజు వ్రతాన్ని ఆచరిస్తే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని చెప్పుకుంటారు. ఈ ఆషాఢ మాసంలోనే చంద్రుడి శక్తి సంపూర్ణంగా ఉండే రోజు అషాఢ పూర్ణిమ. ఇటు ఆషాఢమనే కారణంగా పవిత్రత, పూర్ణిమైన కారణంగా మానసిక స్వస్థత ఉండడంతో ఈ ఆషాఢపూర్ణిమ ఉపదేశాన్ని స్వీకరించేందుకు వీలుగా రుషులు నిర్ణయించారు. ఈ పూర్ణిమను గురు పూర్ణిమగా లెక్కిస్తారు. ఆషాఢ మాసంలో ధార్మిక కార్యక్రమాలు మాత్రమే జరపాలని, శూన్య మాసంగా నిర్ణయిస్తూ శుభకార్యాలు చేయడం సరి కాదని భావిస్తారు.

### ఏకాదశి వ్రత మహత్యం

పవిత్ర ఆధ్యాత్మిక ముక్తిప్రద దినం తొలి ఏకాదశి. దీనికి హరి దినమని మరో పేరు ఉంది. ఏకాదశి వ్రతంలో ఉన్న విశిష్టత పద్మపురాణం చదివితే తెలుస్తుంది. త్రిమూర్తుల్లో శ్రీహరితో ముడిపడిన ఈ ఏకాధశి మహత్యం గురించి అనేక కథలు పురాణాల్లో ఉన్నాయి. కష్టాల్లో తలమునకలవుతున్న మానవ జాతిని కాపాడడానికి శ్రీహరి ఈ ఏకాదశిని ఏర్పాటు చేశాడని, వ్రతాన్ని నియమనిష్టలతో ఆచరిస్తే సమస్త వ్యాధుల నుంచి విముక్తి పొందుతారని చెబుతారు. వ్రతాన్ని ఆచరించే వారు ఏకాదశి నాడు సూర్యోదయానికి ముందుగానే స్నానం ఆచరించి శ్రీహరిని పూజించాలి. ఆరోజు మొత్తం ఉపవాసం ఉండాలి. అసత్యం ఆడవద్దు. దుష్ట ఆలోచనలు చేయవద్దు. రాత్రంతా జాగారణ చేయాలి. ద్వాదశి నాడు ఉదయమే శ్రీహరిని పూజించి నైవేద్య తాంబూలాలు సమర్పించి భోజనం చేయాలి. అన్నదానం చేయడం మంచిది.

## అంజన్న సేవలో న్యాయమూర్తులు



కొండగట్టులో న్యాయమూర్తి మహేష్‌నాథ్

మల్యాల, జూలై 16: కొండగట్టు అంజనేయస్వామిని మంగళవారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సిద్దిపేట జూనియర్ సివిల్ జడ్జి పి.చందన, మల్కాజిగిరి సీనియర్ సివిల్ జడ్జి జీవీ మహేష్‌నాథ్ వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో చంద్రశేఖర్ తదితరులు సత్కరించారు.

● అంజన్నను దర్శించుకున్న పూర్ణ



స్వామివారి సన్నిధిలో పూర్ణ

ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన పూర్ణ మంగళవారం కొండగట్టుకు వచ్చి ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణను ఆశీర్వదించారు

## రుణమాఫీ జీవోను సవరించాలి

జమ్మికుటం,జూలై 16: రుణమాఫీ జీవోను రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా సవరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెల్పూరి రాజు అన్నారు.పట్టణంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చి హమీలను విస్మరిస్తూ జీవోల పేరిట అయోమయానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. రేషన్ కార్డు ఆధారితంగా ఉన్నవారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ చేస్తే కుటుం బం నుంచి విడిపోయిన వారికి రుణమాఫీ వర్తించదన్నారు. పది సంవత్సరాలుగా రైతులు రుణాలు తీసుకొని వడ్డీలు పెరిగి ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ సరిగా చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేలా చూడాలని అన్నారు.

## పంచాయతీ నిధులను కార్మికుల వేతనాలకే కేటాయించాలి

జమ్మికుంట,జూలై16: ప్రభుత్వం విడుదల చేసిన పంచాయతీ నిధులను కార్మికుల వేతనాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ ద్వారా విడుదల చేసిన నిధులలో మొదటి ప్రాధాన్యతగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని అన్నారు. జిల్లాలో నాలుగు కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి రవీందర్‌రావు, ఆసాల సారయ్య, రవి ఉన్నారు.

## రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట,రూరల్16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ. 7,450 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు తొమ్మిది క్వింటాళ్ల పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ట ధర.7,450 కనిష్ట ధర రూ.7,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

## ఫేక్ మెసేజ్‌తో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

జగిత్యాల టౌన్, జూలై 17: బట్టల షాపులో చీరెలు కొని రూ.10 వేలు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపినట్లు ఫేక్ మెస్సేజ్ చూపించి మోసం చేసిన వ్యక్తిని మంగళవారం జగిత్యాల పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. జగిత్యాలలోని ఓ బట్టల దుకాణంలో ఈ నెల 12న నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. అదే రోజు బాధితురాలు జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మంగళవారం టౌన్ సీఐ వేణు గోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు విద్యానగర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. విచారణలో ఇటీవల జగిత్యాల పట్టణంలో ఫేక్ మెస్సేజ్‌తో రూ. 10 వేలు మోసం చేసిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన రామగిరి సురేష్‌గా గుర్తించి అతని వద్ద రూ. 5 వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్, నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడిపై ఇదివరకే నిర్మల్ జిల్లాలోని నిర్మల్ టౌన్‌తో పాటు మంచిర్యాల జిల్లా నెన్నెల, జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్లు వివరించారు.

## మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

రుద్రంగి, జూలై 16: రుద్రంగి మండల కేంద్రంలోని నేవూరిపల్లెకు చెందిన నేవూరి అంజయ్య(28) మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంజయ్య మద్యానికి బానిసై నిత్యం తాగి వచ్చి భార్యను కొట్టేవాడు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన అంజయ్య పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఉయ్యాలకు సోమవారం రాత్రి ఉరేసుకున్నాడు. అంజయ్య భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## వృద్ధుడి అదృశ్యం

వీర్నపల్లి, జూలై 16: రుద్రంగి మండలం చింతామణి తండాకు చెందిన గుగులోత్ హరిసింగ్(60) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం చింతమణితండాకు చెందిన గుగులోత్ హరిసింగ్ శనివారం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. హరిసింగ్ ఆచూకీ లభించలేదు. భార్య గుగులోత్ దేవి రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## గట్టుదుద్దెనపల్లిలో చోరీ

మానకొండూర్, జూలై 16 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో మంగళవారం దొంగతనం జరిగింది. స్థానిక సీఐ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల భారతమ్మ అనే మహిళ ఐదు రోజుల క్రితం కనపర్తి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం ఇంటికి వచ్చిన మహిళ ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగుల కొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూసినట్లు తెలిపారు. ఇంటిలోని బీరువాను పగుల కొట్టి అందులోని రెండు తులాల చంద్రహారం, పట్టగొలుసులు దొంగిలించుకపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఆత్మహత్యకు యత్నించిన ఆర్టీసీ డ్రైవర్ మృతి


మనోహర్‌రెడ్డి (ఫైల్)

కరీంనగర్ అర్బన్, జూలై 16: ఆర్టీసీ కరీంనగర్- 1 డిపో డ్రైవర్‌గా పని చేస్తున్న చిట్యాల మనోహర్‌రెడ్డి (55) ఈనెల 7న ఆత్మ హత్యకు యత్నించి చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. మనోహర్‌రెడ్డి 7వ తేదీ మధ్యాహ్నం విధులకు హాజరైన సమయంలో ఆర్టీసీ అధికారులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వ హించగా ఆల్కహాల్ శాతం 21 వచ్చింది. దీంతో డ్యూటీ చేయడానికి నిరాకరించిన అధికారులు నోటీసులు జారీ చేసి సస్పెం డ్ చేశారు. మనస్థాపం చెందిన డ్రైవర్ మనోహర్‌రెడ్డి వన్ డిపోలో బాత్ రూములో పురుగుల మందు తాగి పడి పోయి ఉండగా తోటి ఉద్యోగులు చూసి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. చికిత్స పొందుతున్న మనోహర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు, ఆర్టీసీ కార్మికులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. అప్పటి వరకు మృతదేహానికి పోస్టు మార్టం చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆర్టీసీ పీఓ చంద్రయ్య, డిప్యూటీ ఆర్ఎం (మెకానికల్) సత్యనారాయణలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విషయం తమ పరిధిలో లేదని, ఉన్నతాధికారులకు రెక మండ్ చేస్తామని ఆర్టీసీ ఉద్యోగ సంఘ నాయకులకు, మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు.

### ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూలై 16: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాయమల్లు (42) అనే యువకుడు మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన రాయమల్లు గతంలో పది సంవత్సరాలు సింగాపూర్ వెళ్లి ఇంటికి తిరుగొచ్చి పంచర్ కొట్టు నిర్వ హించుకుంటూ జీవిస్తున్నాడు. రాయ మల్లు తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి మానసిక పరిస్థితి సరిగ్గా ఉండదు. ఇద్దరు కూతుళ్లు, భార్యతో పాటు తల్లిని పోషిస్తూ ఉండేవాడు. త నకు ఏ ఆపదొచ్చినా వెనకా ముందు ఎవరూ లేరని తరచూ తన భార్యతో చెప్పుకుంటూ మానసికంగా కృంగిపోయేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉద యం భార్యను నిద్ర లేపిన రాయమల్లు ఇంట్లోనే కాసేపటికి ఉరేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిద్రలోంచి లేచిన పిల్లలు ఒక్కసారిగా తండ్రిని చూసి షాక్‌కు గురయ్యారు. అమ్మా నాన్నకు ఏమైంది. పిలిస్తే మా ట్లాడుత లేదు అంటూ తల్లితో రోదించిన తీరు అక్కడున్న వారిని కన్నీళ్లుపె ట్టించింది. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# లాభాల బాటలో ఆర్టీసీ లాజిస్టిక్స్

● ఏటా పెరుగుతున్న ఆదాయం ● పది కోట్లకు చేరువలో సంవత్సర ఆదాయం


పార్సిల్స్ బుక్‌చేసుకోవడానికి వేచి ఉన్న కస్టమర్లు

భగత్‌నగర్, జూలై 16: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయా ణికులను చేరవేయడంతో పాటు ఆదాయ వనరులను అన్వేశిస్తున్నది. లాభాలు అంతంత మాత్రంగానే ఉన్న ఆర్టీసీకి జవసత్వాలు అందిం చేందుకు ఆర్టీసీలో కార్గో, లాజిస్టిక్స్‌ను 2020 సంవత్సరంలో ప్రవేశ పెట్టా రు. ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌లో 11 డీఓలు కరీంనగర్-1, కరీం నగర్-2, గోదావరిఖని, మంథని, జగిత్యాల, కోరుట్ల,మెట్‌పల్లి, సిరిసిల్ల, వేముల వాడ, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోలున్నాయి. నిత్యం ఆర్టీసీ బస్సు లు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్తుండడాన్ని దృష్టిలో ఉంచుకుని పార్సిల్స్, పార్సిల్ కవర్స్, ప్రజలు తమకు సంబంధించిన వారికి వస్తు వులను ఆర్టీసీ ద్వారా పంపిస్తుండడంతో ఆర్టీసీ లాజిస్టిక్స్ లాభాల బాటలో పయనిస్తున్నది.


బార్‌కోడ్ ద్వారా వస్తువులను పరిశీలిస్తున్న సిబ్బంది

**రీజియన్ వ్యాప్తంగా ఏటా పెరుగుతున్న ఆదాయం**

రీజియన్ వ్యాప్తంగా 2020-21 సంవత్స రంలో 3,41,905 పార్సిల్స్ బుక్ చేసి 3,00,00,980 రూపాయలను ఆర్జించారు. 2021-22సంవత్సరంలో 5,40,728 పార్సిల్స్ బుక్‌చేసి 5,56,38,384 రూపాయలు ఆర్జించారు. 2022-23 సంవత్సరంలో 5,80,651 పార్సిల్స్ బుక్‌చేసి 7,47,62,857 రూపాయలు, 2023-24 సంవత్సరంలో 5,92,212 పార్సిల్స్ బుక్‌చేసి 9,32,99,988 రూపాయలు ఆర్జించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి జూన్ వరకు 1,33,047 పార్సిల్స్ బుక్‌చేసి 2,34,96,206 రూపాయల ఆదాయాన్ని ఆర్జించారు.

**రీజియన్‌లోని వివిధ డిపోల్లో వచ్చిన ఆదాయం**

కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోల్లో 2023-24 సంవత్సరంలో ఏటా లాజిస్టిక్స్ ఆదాయం పెరుగుతూ 9,32,99,988 రూపాయల ఆదాయం సమకూరింది. గోదావరిఖని డిపోలో 68,671 పార్సిల్ బుక్ చేసి 1,10,37, 640 రూపాయలు, హుస్నాబాద్ 11,138 పార్సిల్స్‌కు 15,31,046 రూపా యలు, హుజూరాబాద్ 20,645 పార్సిల్స్‌తో 37,15,332 రూపాయలు, కరీం నగర్-1 డిపోలో 2,98,823 పార్సిల్స్‌తో 4,67,46,316 రూపాయలు, కరీంనగర్-2 డిపోలో 11,549 పార్సిల్స్‌తో 27,16,433 రూపాయలు, మంథని డిపోలో 8,435 పార్సిల్స్‌తో 12,39,473 రూపాయలు వచ్చింది.

జగిత్యాల డిపోలో 63,872 పార్సిల్స్‌తో 86,27,859 రూపాయలు, కోరుట్ల డిపోలో 19,788 పార్సిల్స్‌తో 27,57,522 రూపాయలు, మెట్‌పల్లి డిపోలో 21,046 పార్సిల్స్‌తో 27,48,054 రూపాయలు, సిరిసిల్ల 55,453 పార్సిల్స్‌తో 1,04, 58,060, వేములవాడ 12,792 పార్సిల్స్‌తో 17,22,253 రూపాయల ఆదాయం వచ్చింది. మొత్తానికి 2020-21 నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఆర్టీసీ లాజిస్టిక్స్ ఆదాయం ప్రతి ఏటా రెండు కోట్ల మేర పెరుగుతూ వస్తున్నది. ప్రయాణికులను చేరవేయడంతో పాటు పార్సిల్స్, కార్గో ద్వారా వస్తువులను చేరవేస్తూ ఆర్టీసీ ప్రజల మన్ననలు పొందుతున్నది.

**కొత్త సాఫ్ట్‌వేర్‌తో సులభతరం: లాజిస్టిక్స్ ఏటీఎం సదాశివ్**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రారంభించిన కార్గో, లాజిస్టిక్ సేవలతో ప్రయాణికులకు మరింత చేరువయ్యాం. కొత్తగా ప్రవేశపెట్టిన సాఫ్ట్‌వేర్‌తో పార్సిల్స్, వస్తువులను ప్రయాణికులను సులభంగా చేర వేస్తున్నాం. బార్‌కోడ్ సిస్టంతో వస్తువులను సులభంగా తెలుసుకునే వీలుంది. బస్సులు చేరుకునే సమయానికి పార్సిల్స్ ప్రజలకు అందుతుండడంతో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ఈ సంవత్సరం 11 కోట్ల మేర ఆదా యం రాబట్టాలన్నదే లక్ష్యంగా నిర్ణయించుకున్నాం.


పార్సిల్స్‌ను సిస్టంలో పరిశీలిస్తున్న సిబ్బంది

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

● 11 తులాల బంగారం, రూ. 4లక్షల నగదు ఆహుతి
● తప్పిన ప్రాణాపాయం

వెల్గటూర్, జూలై 16: మండలంలోని పైడిపల్లిలో గాదెనవేని మల్లయ్య ఇంటిలో మంగళవారం విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించింది. ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్యకు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. మల్లయ్యతో పాటు అతని చిన్న కుమారుడు గాదెనవేని సత్తయ్య, కోడలు మమత కలిసి ఒకే ఇంటిలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు రమేష్ కొత్తగా ఇల్లు కట్టుకోవడం వలన వారికి సంబంధించిన వస్తువులు తండ్రి మల్లయ్య ఇంటిలోనే పెట్టాడు. మంగళవారం ఇంటిలో ఎవరి పనులకు వారు వెళ్లిన సమయంలో ఇంట్లో విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. ఇంటిలో ఉన్న బట్టలకు, వడ్ల పరదాలకు మంటలు అంటుకొని ఇళ్లంతా వ్యాపించాయి. ఈ సంఘటనలో రమేష్‌కు చెందిన రూ.2 లక్షల నగదు, టీవీ, ఫ్రిజ్‌లు అగ్నికి కాలిపోయాయి. చిన్న కొడుకు సత్తయ్యకు చెందిన రూ. 2 లక్షల నగదు, అతని భార్యకు చెందిన 5 తులాల బంగారు ఆభరణాలు, మల్లయ్య కూతురుకు చెందిన 5 తులాల బంగారు ఆభరణాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.4 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలతో పాటు బట్టలు, వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే గ్రామస్థులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పి వేశారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయింది.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తంగళ్లపల్లి, జూలై 16: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ట్రాక్టర్, కారు ఢీ కొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రాక్టర్ (ట్రాలీ లేకుండా)పై డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి వెళ్తున్నారు. అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ పైకూర్చున్న తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మునిగే ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రేషన్ కార్డు లేకున్నా రూ.2 లక్షల రుణమాఫీ

● బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వడ్డీ మాఫీ అమలు కార్యక్రమంగా రుణమాఫీ ● ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, జూలై 16: రేషన్ కార్డు ఫ్యామిలీ యూనిట్ గుర్తింపు చేయడానికి తప్ప రుణమాఫీ అమలు చేయడానికి ఏ విధంగా అభ్యంతరం కాదని, రేషన్ కార్డు లేనివారు కూడా రూ.2 లక్షల రుణమాఫీ పొందే అవకాశం ఉందని ఎమ్మె ల్సీ జీవన్‌రెడ్డి అన్నా రు. రాయికల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆనాడు యూపీఏ ప్రభుత్వం ఏకకాలం లో రూ.లక్ష రుణమాఫీ చేసిందని, మళ్లీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ హయాంలో రూ.2 లక్ష రుణ మాఫీ ఏకకాలంలో చేయడం హర్షించదగిన విషయమన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని పేర్కొన్నప్పటికీ అది విడతలవారీగా వచ్చేసరికి కేవలం వడ్డీ మాఫీ అమలు కార్యక్రమంగా మిగిలిపోయింద న్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ప్రభుత్వంపై కొంత ఆర్థిక భారం అని భావించినప్పటికీ రైతు సంక్షేమం ప్రధానం కాబట్టి రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా ఏ విధమైన ఆంక్షలు లేకుండా కుటుంబం ఒక యూనిట్‌గా ఆగస్టు 15లోపు రూ.2 లక్షలు పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

రేషన్ కార్డు అనేది ఫ్యామిలీ యూనిట్‌ను గుర్తింపు చేయడానికి మాత్ర మే. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు క్లారిటీ ఇచ్చారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దేశంలో ఎక్కడా కూడా రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేపట్టడం లేదన్నారు. ఈరోజు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలతోగానీ, చీడ పురుగులతోగానీ పంట నష్ట పోతే వారిని ఆదుకునే విధంగా పంటల బీమా పథకం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు రూ.7500 ఇచ్చే విధంగా ముందుకు వెళ్తుందన్నారు. సన్న రకం సాగు చేసే రైతుకు ప్రతి క్వింటాల్‌కు రూ.500 మద్దతు ధరకు అదనంగా ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు మాసాల్లో రాయికల్ మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పూర్తి చేశామన్నారు. అనంతరం మండలంలోని లోక్యానాయక్ తండా, మంగ్యానాయక్ తండాలో శీత్లా భవానీ, తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొని దర్శించుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి ఉన్నారు.

## లింగన్నపేట ఆందోళనలో 23 మందిపై కేసు

గంభీరావుపేట, జూలై 16 : గంభీరావుపేట మండలం లింగన్న పేటలో ఇటీవల శ్రీనాథ్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకోగా మృతదేహంతో ఈ నెల 14న రోడ్డుపై ఆందోళన చేసిన ఘటనలో 23 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాంమోహన్ తెలిపారు. లింగన్నపేటకు చెందిన తుడుం శ్రీనాథ్ ఈ నెల 10న ప్రేమ వ్యవ హారంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ 13న మృతి చెందాడు. శ్రీనాథ్ ఆత్మహత్యకు ప్రేమికు రాలు కారణమంటూ బంధువులు 14న అర్ధరాత్రి దాటాక రోడ్డుపై బైఠాయించారు. వాహనదారులకు ఇబ్బంది కలిగేలా చేయ డంతోపాటు ఉదయం కూడా శ్రీనాథ్ మృతదేహంతో మరోసారి ఆందోళన చేశారని, పోలీస్‌ల విధులకు ఆటంకం కలిగించారని ఎస్సై రాంమోహన్ వెల్లడించారు.

శ్రీనాథ్ ఇంటి నుంచి మృతదేహాన్ని గాంధీ వద్దకు తెచ్చే క్రమంలో పోలీస్‌లను బలవంతంగా తోసేశారని, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఈ సంఘటనలో 23 మందిపై కేసు నమోదు చేశామని, కేసు విచారణలో భాగంగా ఈసానిపల్లి శేఖర్, గంగి నరేష్, కొత్తపల్లి ప్రవీణ్‌ను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 16: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని దుకాణం ఎదుట నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని మంగళవారం దొంగలు ఎత్తుకెళ్లారు. గొల్లపల్లిలోని కర్ర దుకాణం ఎదుట బైక్‌ను నిలిపి లోనికి వెళ్లి వచ్చే సరికి వాహనం కనిపించకుండాపోయింది. బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## తాళం పగులగొట్టి రెండు ఇళ్లల్లో దొంగతనం

14 తులాల బంగారం, 37 తులాల వెండి ఆభరణాలు చోరీ

కరీంనగర్ క్రైం, జూలై 16: కట్టరాంపూర్‌లోని వినా యకనగర్, వివేకానందనగర్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినాయకనగర్‌కు చెందిన టి.మంగ పంచాయతీరాజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నది.

ఆమెకు మంగళవారం ఉద్యోగ బదిలీ కోసం కౌన్సెలింగ్ ఉండటం తో ఈనెల 14న రాత్రి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళింది. మంగళవారం పక్క ఇంటివారు మంగ ఇంటి తలుపులు తెరచి, తాళం పగులగొట్టి ఉం దని ఫోన్‌లో ఆమెకు సమాచారం అందించారు. ఆమె కరీంనగర్‌లోని ఇంటికి చేరుకుని పరిశీలించగా కప్‌బోర్డు లో భద్రపరిచిన 14.3 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే పక్క ఇంటి వారి బైక్‌ను కూడా దొంగ లు ఎత్తుకుపోయారు. వివేకానందనగర్‌లో పద్మ ఈ నెల 13న ఉదయం ఇంటికి తాళం వేసి హైదరా బాద్‌లోని తన కొడుకు వద్దకు వెళ్లింది. ఆమె ఇంటి తాళం పగులగొట్టి ఉందని మంగళవారం స్థానికులు ఫోన్ చేయగా ఆమె కరీంనగర్‌కు వచ్చి చూసే సరికి ఇంటి బీరువాలో భద్రపరిచిన 17 తులాల వెండి ఆభరణలు కనపడలేదు. దొంగలు ఇంటిలో చొరబడి చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధితుల ఫిర్యాదు మేరకు దొంగతనం కేసులు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాలను కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్, క్లైటీం పోలీసులు పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీ లిస్తున్నారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. నలుగు రు దొంగలు చేతులకు గ్లౌస్, ముఖాలకు మాస్కులు వేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లుగా పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

### హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, జూలై 16: మండలంలోని గాగి రెడ్డిపల్లిలో దేవునూరి వెంకటేశ్ అనే రైతుకు చెందిన లేగదూడ హైనా దాడిలో మంగళవారం మృతి చెందింది. గ్రామ శివారులో తన వ్యవసాయ బావి వద్ద పశువుల పాకలో పాడి ఆవులతో పాటు లేగ దూడను కట్టేసి సోమవారం సాయంత్రం రైతు వెంకటేష్ ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూసే సరికి లేగదూడ మృతి చెంది ఉన్నది. తీవ్రంగా గాయపడ్డ లేగదూడను పరి శీలించగా హైనా దాడి అని నిర్ధారించినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ సన్నీళ్ల వెంకటేశం కోరారు. చిగురుమామిడి మండలంలో హైనా దాడులు పెరిగి పోతున్నాయని, దీంతో రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లడానికి భయ పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. హైనా దాడులను అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు.

## వాహనాల దొంగలను పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, జూలై, 16 : మెట్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో వాహనాలను అపహరించిన ఇద్దరు దొంగలను మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవిలు పట్టు కున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మం గళవారం పోలీసుస్టేషన్‌లో పట్టుకున్న దొంగలను చూపు తూ వివరాలను వెల్లడించారు. మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందని యాశాడ వెంకటి అనే రైతుకు సం బంధించిన మహేంద్ర ట్రాక్టర్ ట్రాలీని గ్రామ శివారులో జూన్ 29న ఉంచాడు. మండలంలోని రామా రావుపల్లి గ్రామానికి చెందిన పొన్నం రవీందర్‌గౌడ్ వ్యవ సాయం చేస్తూ ట్రాక్టర్ ట్రాలీలు కొంటూ అమ్ముతుండే వాడు. ట్రాక్టర్‌ల కోసం గ్రామాల్లో వెతుకు తుండగా చౌల మద్ది గ్రామ శివారులో ఉన్న యాశాడి వెంకటి ట్రాక్టర్ ట్రాలీ ని అపహరించాడు. అపహరించిన ట్రాలీకి రంగు మార్చి మరో చోట దాచాడు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని మణికంఠ వైన్స్ వద్ద ఈ నెల 12న చెప్యాల శంకర్ తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. మల్లాపూర్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన మదికుంట మహేష్ అనే వ్యక్తి మద్యానికి బానిసై నిలిపిన ద్విచక్ర వాహనాన్ని అపహరించాడు. బాధి తుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీ విలు పట్టణంలోని బస్ డీపో సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా అను మా నాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకుని విచారిం చగా వాహనాలను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. అప హరించిన వాహనాలను వారి నుంచి స్వాధీనం చేసు కుని అరెస్టు చేసినట్లు తెలిపారు.


### బొలెరో, ట్రాక్టర్ ఢీ ఇద్దరు మృతి


మహేష్, అభిషేక్ (ఫైల్)

ధర్మారం, జూలై 16: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండ లం మల్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం తెల్లవారు జామున బొలెరో, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదం లో ఇద్దరు మృతి చెందారు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామ శివారులో బొలెరో, ట్రాక్టర్ ఎదురె దురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పైన ఉన్న కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్న కొండ గ్రామానికి చెందిన సోమిడి అభిషేక్ (22) అక్కడికక్కడే మృతిచెందగా, ట్రాక్టర్ డ్రైవర్ చీకట్ల మహేష్ (30) ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అలాగే తాండ్ర అశోక్‌కు అనే యువకుడికి గాయాలయ్యాయి. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మంచిర్యాల లోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన బొలెరో డ్రైవర్ తూర్పటి రాజుపై మృతుడు మహేష్ తండ్రి పోచ య్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### కట్టెలతో దాడి చేసి బంగారు, వెండి ఆభరణాల దోపిడీ

అనుమానితుల ఫొటోలు విడుదల చేసిన పోలీసులు


పోలీసులు విడుదల చేసిన అనుమానితుల ఫొటోలు

మల్యాల, జూలై 16: ఒంటరిగా ఉన్న ఓ వ్యక్తిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేసి బం గారు, వెండి ఆభరణాలు, నగదుతో ఉడాయించారు. పోలీసులు తెలిపిన వివ రాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 9న జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండారి స్వామి కొడిమ్యాల మండలం నాచుపల్లికి వెలుతూ కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి క్వారీలకు వెళ్లే మార్గంలో ఆగాడు. ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులు కట్టెలతో వచ్చి స్వామిని కొట్టి అతని వద్ద గల బంగారం, వెండి, నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. దీంతో బాదితుడు మల్యాల పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేయగా ఇద్దరు వ్యక్తుల ఆనవాళ్లను స్వామి తెలుపడంతో పోలీసులు అనుమా నితుల ఫొటోలను విడుదల చేశారు. ఈ ఫొటోలలో గల వ్యక్తుల వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని తగిన పారితోషికం అందించనున్నట్లు సీఐ నీలం రవి, ఎస్సై నరేష్ ఈ సందర్భంగా తెలిపారు.

## ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 5,150 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 5,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.485 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 22.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 436 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 7.826 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.861 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

### ఒకరి రిమాండ్

సిరిసిల్ల క్రైం, జూలై 16: జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బాస ఎల్లవ్వ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ చేసిన మెదక్ జిల్లా గజ్వేల్‌కు చెందిన పర్వతం నర్సింహులును మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. మల్లాపూర్ గ్రామంలో ఎల్లవ్వ తన ఇంటి ముందు నిద్రపోతున్న సమయంలో ఈ ఏడాది జూన్ 21న సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన మరో వ్యక్తితో కలిసి నర్సింహులు ద్విచక్రవాహనంపై వచ్చాడని, పుస్తెలతాడు తెంపుకొని పారిపోయాడని పేర్కొన్నారు. ఇదే సమయంలోనూ మల్లాపూర్ గ్రామంలో తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేశ్‌కు చెందిన మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో సాంకేతిక సమాచారం ఆధారంగా సిరిసిల్ల వైపు వస్తున్న నర్సింహులును అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మూడు తులాల పుస్తెలతాడు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

### ఊర కుక్క దాడిలో బాలుడికి గాయాలు


దేవేందర్ (ఫైల్)

బీర్‌పూర్, జూలై 16: ఊర కుక్క దాడి లో బాలుడికి తీవ్ర గాయాలై స్పృహ కో ల్పోయిన ఘటన బీర్ పూర్ మండలంలోని మంగేళ గ్రామంలో మంగళవారం సా యంత్రం చోటు చేసు కుంది. మంగేళ గ్రామంలోని గోండు గూడెంకు చెందిన పెంద్రం మారుతి ప్రతిభలకు ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద కుమారుడు దేవేందర్ (7) సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఆడుకుం టుండగా ఊర కుక్క వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మొఖం, తల వెనుక భాగంలో, చెవి దగ్గరా గాయ పరచగా చెవి తెగింది. ఈ దాడిలో బాలుడు స్పృహ కోల్పోయాడు. సమీపంలో ఉన్న కాలనీ వాసులు గమనించి కుక్క దాడి నుంచి బాలుడిని రక్షించి జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న తోట ధర్మేందర్, నాయకులు

ముస్తాబాద్, జూలై 16 : గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని గల్ఫ్ జేఏసీ బృందం కోరింది. మంగళవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఏప్రిల్ 16వ తేదీన తాజ్‌దక్కన్‌లో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ భరోసాను కార్యరూపం దాల్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారన్నారు. మేనిఫెస్టోలో ఉన్న బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. గల్ఫ్ దేశాలలో వలస కార్మికుల సంక్షేమం కోసం గల్ఫ్ అండ్ ఆదర్ ఓవర్సీస్ (వెల్ఫేర్ బోర్డు) ఏర్పాటు చేయాలని కోరారు. సమగ్ర ప్రవాస భారతీయుల విధానం ప్రవేశపెట్టాలన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేసియా చెల్లించాలని, కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, టీపీసీసీఎన్ఆర్ఐ ప్రెసిడెంట్ మంద భీంరెడ్డి, రాష్ట్ర గల్ఫ్ జేఏసీ నాయకులు గంగుల మురళీధర్‌రెడ్డి, గల్ఫ్ జేఏసీ జాయింట్ సెక్రెటరీ తోట ధర్మేందర్, కట్ట మనోజ్ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చందుర్తి జూలై 16: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తాజా మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు ప్రభాకర్, ధర్మపురి శ్రీనివాస్, పులి సత్తయ్య, పోతరాజు రవి, వేల్పుల దేవస్వామి, ప్రసాద్, చంద్రం, మల్లేశం, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 'భూ కబ్జాకు యత్నిస్తున్న కాంగ్రెస్ నాయకుడు'

సిరిసిల్ల టౌన్, జూలై 16: సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఎస్సై సహకారంతో తన భూమి కబ్జా చేయాలని చూస్తున్నాడని ప్రముఖ న్యాయవాది సురభి సత్యనారాయణ ఆరోపించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తంగళ్లపల్లి మండలం ఒగులాపూర్ శివారులో 2012లో సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి వద్ద 439 సర్వే నంబరులో 12 ఎకరాల 12 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు, అప్పటి నుంచిఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నట్లు చెప్పారు. ఇటీవల సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆయన భార్య విద్యకు సంబంధించిన రెండు ఎకరాల భూమి ఉందని తన భూమిలోకి కబ్జాకు రావడానికి ప్రయత్నించాడని ఆరోపించారు. భూమికి సంబంధించిన పత్రాలతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే తనపై కేసులు పెట్టి సంగీతం శ్రీనివాస్‌కు ఎస్సై సహకరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంగీతం శ్రీనివాస్ తన స్థలం కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని, కేసు కోర్టులో ఉండగా అతని కొడుకు కొందరు గూండాలతో అర్ధరాత్రి వచ్చి భూమిలోని హద్దురాళ్లను తొలగించాడని ఆరోపించారు.

## విద్యార్థికి అభినందన

ఎల్లారెడ్డిపేట, జూలై 16: బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ హైస్కూల్ విద్యార్థి శ్రీలేష్‌గౌతమ్‌ను సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ మంగళవారం అభినందించారు. విద్యార్థి శ్రీలేష్ గౌతమ్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు లక్ష్మీనారాయణ, విద్యార్థి తండ్రి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ కార్డులు అందజేయాలి

చందుర్తి, జూలై 16: భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ కార్డులు అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. మండలంలోని ఎనగల్ గ్రామానికి చెందిన మాదాసు సునీత అనే భవన నిర్మాణ కూలీ 3నెలల క్రితం వేములవాడలో ఓ బిల్డింగ్ పైనుంచి పడి చికిత్స పొందుతూ అనారోగ్యం క్షీణించి సోమవారం మృతి చెందింది. ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఆపద సమయంలో బాధితులకు, కుటుంబ సభ్యులకు ఉపయోగ పడుతుందన్నారు. మృతురాలి కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట గాజుల పోశెట్టి, కార్మికులు ఉన్నారు.

## ధర్మపురిలో సరుగత్తి వేడుకలు

ధర్మపురి, జూలై 16: మొహర్రం పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలో పెద్ద సరుగత్తి వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వ హించారు. ఏటా నిర్వహించే విధంగా సాంప్రదాయ రీతిలో స్థానిక మున్సిపల్ కార్యాలయం, సారుగమ్మ, రహమత్ పుర వీధుల్లోని ఆ షూర్‌ఖానాల్లో నెలకొల్పిన పీర్లు, నాల్‌సాబుల వరకు ఊరేగించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. పూనకంతో ఉన్న అనేక మంది నాల్‌సాబులు చేతపట్టుకుని సమీపంలో గల అగ్ని గుండంలో దూకి, ప్రదక్షిణలు చేశారు. పలువురు పెద్దపులులు, దెయ్యం తదితర వేషాలతో అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేయగా రాత్రి వరకు వందలాది మంది వేడుకలను తిలకించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఈ వేడుకలను ఆయా ఆషూర్‌ఖానాల ముజావర్లు సర్దాజ్, హుస్సేన్, షేక్ యూసుఫ్, ఘనంగా నిర్వహించారు. ఉర్దూ అకాడమీ బోర్డు మాజీ డైరెక్టర్ అన్వర్‌ఖాన్ సహకారం అందించారు. ఈ సంద ర్భంగా సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# ఫలితాల్లో ఆదర్శం.. సౌకర్యాలు శూన్యం

● శిథిలావస్థలో కొలనూరు పాఠశాల ● వర్షాలకు ఉరుస్తున్న గదులు ● అందులోనే విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు



కొలనూరు పాఠశాల



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం



వర్షానికి ఉరుస్తున్న తరగతిగది పైకప్పు

కోనరావుపేట, జులై 16 : ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. కానీ వసతులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గోడలు తడుస్తున్నాయి. వర్షానికి గదులు ఉరుస్తున్నాయి. కొత్త భవనానికి నిధులు మంజూరు కాకపోవడంతో అందులోనే విద్యను అభ్యసిస్తున్నారు. కోనరావుపేట మండలం కొలనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 85 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరు విద్యను అభ్యసించడానికి ఐదు గదులు ఉండగా అందులో నాలుగు గదులు వర్షానికి ఉరుస్తున్నాయి. గోడలు కూడా తడస్తుండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో కొలనూరు పాఠశాలను ఆదర్శంగా నిలిపారు. ఫలితాలు సాధిస్తున్నా వసతులు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలని, నూతన భవనానికి నిధులు మంజూరు చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం



సన్మానిస్తున్న వెంకటరెడ్డి, నాయకులు

తంగళ్లపల్లి, జూలై 16: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఫ్రెండ్స్ క్లబ్‌లో మాజీ ఎంపీపీ పడిగెల మానసరాజు, తాజా మాజీ ఎంపీటీసీలు కోడి అంతయ్య, కరకబోయిన కుంటయ్య, ములిగే దుర్గాప్రసాద్, గుగ్గిళ్ల లావణ్య బుస్స స్వప్న, సిలివేరి ప్రసూన, పూర్మాణి కనకలక్ష్మిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు చేసిన సేవలను కొనియాడారు. పలువురు నాయకులు, ప్రముకులు మాజీ ప్రజా ప్రతినిధులను సన్మానించారు. కురుమ సంఘం మండల అధ్యక్షుడు ఎగురుల కరుణాకర్ తాజా మాజీ సర్పంచ్ అంకారపు అనిత రవీందర్ దంపతులను సన్మానించారు. ప్యాక్స్ చైర్మన్లు బండి దేవదాస్, కోడూరి భాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు పడిగెల రాజు, మాట్ల మధు, వలకొండ వేణుగోపాలరావు, సిలివేరి నరసయ్య, అంకాకార రవీందర్, కొయ్యడ రమేష్, సిలివేరి చిరంజీవి, గుగ్గిళ్ల ఆంజనేయులు, గుండు ప్రేమ్ కుమార్, సద్ద శోభ, కందుకూరి రామాగౌడ్, బుస్స లింగం తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహర్రం



గొల్లపల్లిలో అసోయిదులా ఆటలు ఆడుతున్న యువకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 16: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బండలింగంపల్లి, నారాయణపూర్, బొప్పాపూర్, హరిదాస్‌నగర్ తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం రాత్రి పీరీల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. యువతీయువకులు, మహిళలు అసోయిదులా ఆటలు ఆడారు. ఆశన్న, హుసన్నను స్మరించుకుంటూ పాటలు పాడారు. రాత్రంతా ఆటపాటలతో గ్రామాలు మార్మోగాయి. పీరీలను డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. బుధవారం పీరీలను గ్రామ పురవీధుల గుండా ఊరేగించి సమీప నీటి వనరుల్లో నిమజ్జనం చేయనున్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని ఒగులాపూర్ గ్రామంలో మంగళవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మసీదులో ఏర్పాటు చేసిన పీరీలను ఊరేగించారు. అనంతరం అగ్నిగుండాలలో నడిచారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతారం గ్రామంలోని పీరీల మసీదు వద్ద అశ్వం విగ్రహాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకలు సలీం, బడుగు లింగం, పర్శరాం తదితరులు పాల్గొన్నారు..



అనంతారంలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

## రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 16 : రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని ఏఐటీ యూసీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎం హెచ్‌వో అందుబాటులో లేక పోవడంతో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధిలోని వివిధ సబ్ సెంటర్‌లలో రెండో ఏఎన్ఎంలు పని చేస్తున్నారని, వారిని రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేయగా అప్పటి ప్రభుత్వం చర్చలు జరిపిందని అన్నారు. రెగ్యులర్ చేయడం లేదా గ్రాస్ వేతనం ఇవ్వడానికి, పని తగ్గించడానికి కమిటీని వేసి జీవోను విడదల చేసిందన్నారు. సమ్మె విరమించిన నాలుగు రోజులకే కొత్తగా ఏపీపీలను తీసుకొచ్చిందని, కమిటీ ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించలేదని ఆరోపించారు. కొత్తగా ఏపీపీలు వచ్చాక రెండో ఏఎన్ఎంలకు మరింత పని భారం పెరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రెండో ఏఎన్ఎంల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండో ఏఎన్ఎంలు ఈ నెల 18న కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు.

## సమస్యలు పరిష్కరించకపోతే ఆమరణ దీక్ష



మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, జూలై 16 : తెలంగాణలోని ప్రభుత్వ హాస్టల్స్‌లో సమస్యలను పరిష్కరించపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో విద్యా సంస్థలు, ప్రభుత్వ హాస్టల్స్ ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో అపరిశుభ్రతతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని హాస్టల్స్‌కు పక్కా భవనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటేష్, మట్టె శ్రీనివాస్, తిరుపతి, వంశీ, రోహిత్ పాల్గొన్నారు.

## రసాభాసగా గ్రామ సభ



అధికారులను నిలదీస్తున్న యువకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 16: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. గ్రామంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లపై చర్యలు ఎందుకు చేపట్టలేదని పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేక అధికారులను యువకులు నిలదీశారు. ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో వెంచర్ల నిర్వహణకు అనుమతులున్నాయో చెప్పాలని పట్టుబట్టారు. వెంచర్లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ పంచాయతీకి చెందాల్సిన స్థలానికి హద్దులు నిర్ణయించలేదని ప్రశ్నించారు. అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, జీపీకి రావాల్సిన ఆదాయాన్ని స్వాహా చేశారని ఆరోపించారు. లెక్కలు చెప్పే వరకు ఇక్కడి నుంచి కదలనీయబోమని స్పష్టం చేశారు. దీంతో గ్రామ సభ గందరగోళంగా మారింది. ప్రతి పైసాకు లెక్కలుంటాయని ప్రత్యేక అధికారి భూమిరెడ్డి పేర్కొన్నారు. అక్రమాలు చోటు చేసుకుంటే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో యువకులు శాంతించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అమరేందర్, ప్రత్యేక అధికారి, ఏవో భూమిరెడ్డి, తాజా, మాజీ ఎంపీటీసీ తిరుపతిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

సిరిసిల్ల రూరల్, జూలై 16: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో మంగళవారం ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో సబ్జెక్టులను బోధించేందుకు ఉపాధ్యాయులు లేరన్నారు. ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలను అందించినా స్పందన లేకుండా పోయిందని అన్నారు. అనేక పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు సరిపోక చెట్లకింద కూర్చొని విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులే క్లీనింగ్ చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుంటే ఏబీవీపీ అధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షను చేస్తామన్నారు.

ఈ సమావేశంలో ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ విభాగం జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, ఎలగందుల శ్రీనివాస్, కాసారపునితిన్, అఖిల్, గౌతమ్, సాయి, జగన్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రతాప రామకృష్ణ జన్మదినం




కేక్ కట్ చేస్తున్న ప్రతాప రామకృష్ణ, నాయకులు

వేములవాడ టౌన్, జూలై 16: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ జన్మదిన వేడుకలను ఆపార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గార్డెన్‌లో ప్రతాప రామకృష్ణను పట్టణ బీజేపీ శాఖ, తంగళపల్లి మండలం బీజేపీ నాయకులు గజమాలతో సన్మానించారు. రుద్రంగి, కథలాపూర్, మేడిపెల్లి, వేములవాడ రూరల్, అర్బన్, తంగళపల్లి, సిరిసిల్లతోపాటు పలు మండలాల నుంచి కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోల కృష్ణస్వామి, జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్, గోపు బాలరాజు, కుమ్మరి శంకర్, బండ మల్లేశం యాదవ్, రేగుల సంతోష్‌బాబు, చింతపల్లి వెంకటేశ్వర్‌రావు మోహన్‌రావు, బుర్ర శేఖర్, జింక అనిల్‌కుమార్, కాచం నిఖిల్, తంగళపల్లి మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, మల్లారెడ్డి, కాళిచరణ్, ప్రసాద్, రాజు, మహేందర్, వినయ్ యాదవ్, శ్రీనివాస్ అరుణ్ తదితరులు ఉన్నారు.

### ఎల్లారెడ్డిపేట, చందుర్తిలో..

ఎల్లారెడ్డిపేట : బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆ పార్టీ నాయకులు మంగళవారం ప్రతాప రామకృష్ణ నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. జ్ఞాపికను అందజేసి సన్మానించారు. నాయకులు లక్ష్మారెడ్డి, వేణు, కిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పొంచెట్టి రాకేష్ కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిర్రం తిరుపతి, పెరుక గంగరాజు, బందెల వెంకటేశం, గడికొప్పుల జీవన్, అంబాల శ్రీకాంత్, చింతకుంట సాగర్, మార్త రాజు, మెంగని రాజేందర్, పంచేర్పుల దివ్యాసాగర్, మోత్కుపల్లి తిరుపతి, బొల్లు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ బోర్డుకు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలి

కథలాపూర్, జూలై 16 : ఏప్రిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి రూ.500 బడ్జెట్ కేటాయించాలని గల్ఫ్ సంక్షేమ సమితి కో ఆర్డినేటర్ గోపిడి దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. గల్ఫ్‌లో దాదాపు 15 లక్షల మంది తెలంగాణ వాసులు ఉపాధి పొందుతున్నారని, ఎన్ఆర్ఐ పాలసీతో కూడిన గల్ఫ్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వలస జీవుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియాకు సంబంధించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. అదేవిధంగా గల్ఫ్ వెళ్లిన వ్యక్తుల పేర్లు ఓటర్ లిస్టు నుంచి తొలిగించవద్దని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు అర్హులుగా చేయాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా నాగరాజు

మేడిపల్లి, జులై 16: కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా చేపూరి నాగరాజు, కార్యదర్శిగా శ్రీధర్, ఎర్రన్నను మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనకు పార్టీ అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణగా నెరవేరుస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు లచ్చానాయక్, నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆర్డర్లతో రెండు రోజులే పని




సమావేశంలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, జూలై 16 : వస్త్రపరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులకు సరిపోయే ఆర్డర్లు మాత్రమే ఇచ్చిందని, మరమగ్గాల కార్మికులకు రెండు నెలల పని కల్పించినట్లు చేనేత జౌళిశాఖ అధికారులు ప్రకటించడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో అమృత్‌లాల్ శుక్లా కార్మికభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఐటీయూ ఆసాముల ముఖ్య నాయకుల సమావేశాన్ని గోనె పర్శరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రమేష్ మాట్లాడుతూ సిరిసిల్లలో నెలకొన్న వస్త్ర పరిశ్రమల సంక్షోభంతో 8 నెలలుగా మరమగ్గాల కార్మికులు, ఆసాములకు పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలని ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం వస్త్రాల తయారీ ఆర్డర్లను ఇచ్చిందని, ఆ ఆర్డర్లతో రెండు రోజులు మాత్రమే పని లభిస్తుందని అన్నారు. చేనేత జౌళిశాఖ అధికారులు మాత్రం కార్మికులకు రెండు నెలల ఉపాధిని కల్పించినట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం 18లక్షల మీటర్ల ఆర్డర్లను మాత్రమే అందించినట్లు చెప్పారు. సుమారు 8 నుంచి 10 కోట్ల మీటర్ల ప్రభుత్వ వస్త్రాల ఆర్డర్లను ఇస్తేనే ఆసాములు, మరమగ్గాల కార్మికులకు ప్రస్తుతం ఉపాధి దొరుకుతుందని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు. ఆసాములకు 10 హెచ్‌పీల వరకు ఉచిత కరెంట్ ఇవ్వాలని, ఎక్కువ మరమగ్గాలు ఉన్న వాళ్లకు విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనికోసం సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లోని భవాని ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు ఆసాముల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసాములందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రకాష్‌రావు, కొండ సుభాష్, కోడం రమేష్, బూర శ్రీనివాస్, గోవిందు కనుకయ్య, రాపెల్లి రఘుపతి, దూస అశోక్, గోనికె చంద్రకాంత్, సంతోష్, చంద్రమౌళి, మామిడాల రాజేశం, రాజమౌళి, కనుకరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.